సాక్షి నల్లగొండ

శనివారం । 21 । డిసెంబర్ । 2024



ఆధారాలతోనే కేటీఆర్‌పై కేసు

ఆధారాలు ఉన్నందునే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదైందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. - 8లో



ఆర్థిక స్వావలంబన సాధించాలి

రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. - 8లో



బోనస్‌కు కక్కుర్తి పడి..

ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర, బోనస్‌కు కక్కుర్తి పడిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు తెర తీశారు. - 8లో

న్యూస్‌రీల్

22న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 22న ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ ఖోఖో జట్లను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నాతి కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. క్రీడాకారుల వెంట సంబంధిత పీఈటీలు, ఖోఖో కోచ్‌లు రావాలని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జనవరి 8,9,10 తేదీల్లో వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగే 57వ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు నాతి కృష్ణమూర్తి 9866368843, ఎన్.నాగేశ్వర్‌రావు 6300085314, డి.స్వాతి 9912754498 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా డీఈఎల్‌ఈడీ పరీక్ష

నల్లగొండ : నల్లగొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ) పేపర్-3 ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ పరీక్ష ప్రశాంతంగా సాగింది. పరీక్షకు 40 మంది విద్యార్థులకు గాను 38 హాజరయ్యారని.. కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారని డీఈఓ భిక్షపతి తెలిపారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ విలీనం



మాట్లాడుతున్న ఆర్‌ఎం విజయభాస్కర్‌గౌడ్

నల్లగొండ : తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకును విలీనం చేస్తున్నట్లు ఏపీజీవీబీ నల్లగొండ రీజియన్ రీజనల్ మేనేజర్ బి.విజయభాస్కర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వం ఆర్థిక సేవల శాఖ ఆదేశాల మేరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ జనవరి 1నుంచి విలీనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని బ్యాంకు ఖాతాదారులు గమనించాలన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. విలీనం కారణంగా బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌లు మారవన్నారు. ఏటీఎం కార్డులు, మొబైల్ బ్యాంకింగ్ సేవలు తిరిగి తీసుకోవాలని సూచించారు.

మూసీ కాల్వలకు నేడు నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ఆయకట్టులో యాసంగి పంట సాగు కోసం ఈనెల 21తేదీ నుంచి ప్రధాన కాల్వలకు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న నీటి విడుదల కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమానికి మూసీ ఆయకట్టు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

చిట్యాల : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. చిట్యాల మండలం వెలిమినేడులోని పీహెచ్‌సీ, ఆరోగ్య ఉప కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులను, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్, ల్యాబ్, మందులు నిల్వ గదిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్, వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఫార్మాసిస్ట్ హేమ, వైద్య సిబ్బంది వరలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.





క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, కలెక్టర్ తదితరులు

సాదాబైనామాపై ఆశలు

భూభారతి చట్టం ద్వారా అందనున్న పట్టాలు

- ఉమ్మడి జిల్లాలో 25,430 దరఖాస్తులు పెండింగ్
- ఎలాంటి సమస్య లేనివాటికి మొదట పరిష్కారం
- దరఖాస్తుదారుల ఎదురుచూపులకు తెరపడే అవకాశం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకొస్తున్న భూభారతి ఆర్‌ఓఆర్ – 2024 చట్టం ద్వారా సాదాబైనామాలకు మోక్షం కలగనుంది. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరిస్తామని ప్రభుత్వం చట్టంలో స్పష్టం చేసింది. దీంతో సాదాకాగితంపై రాసుకుని భూమిని కొనుగోలు చేసి.. రిజిస్ట్రేషన్లు చేసుకోకుండా ఉన్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. మూడేళ్ల క్రితమే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాదాబైనామా కోసం 25,430 దరఖాస్తుల వచ్చాయి. కొత్త చట్టం ద్వారా ఎలాంటి సమస్యలు లేని సాదాబైనామాలను ప్రభుత్వం మొదట పరిష్కరించనుంది. సమస్యలుంటే విచారణ చేసిన తరువాత పరిష్కారం చూపనుంది.

ధరణిలో కనిపించని ఆప్షన్లు..

గత ప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్ తీసుకొచ్చి దాని ద్వారానే భూ నిర్వహణను కొనసాగించింది. అయితే ధరణిలో అన్ని రకాల ఆప్షన్లు లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. అందులో సాదాబైనామాలు కూడా ఒకటి. ధరణిలో సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ల కోసం ఆప్షన్లు లేకపోవడంతో చాలా మంది గత ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. వారి విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న అప్పటి ప్రభుత్వం సాదాబైనామాలను పరిష్కారానికి చర్యలు చేపడతామని మూడేళ్ల కిందటే దరఖాస్తులు స్వీకరించింది.

ఏళ్లుగా ఎదురుచూపులు

సాదాబైనామా సమస్యను పరిష్కరించడంలో గత ప్రభుత్వం జాప్యం చేసింది. దీంతో ఆయా దరఖాస్తుదారులంతా సాదాబైనామాల రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూపుల్లో ఉన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కొత్తగా భూభారతి ఆర్‌ఓఆర్ చట్టం -2024ను తీసుకొస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. త్వరలోనే చట్టం అమల్లోకి రానుంది. దాంతో సాదాబైనామా సమస్య పరిష్కారం కానుంది.

25,430 దరఖాస్తులు మూలకు..

ఉమ్మడి జిల్లాలో 25,430 సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. అందులో నల్లగొండ జిల్లాలో 13,080, సూర్యాపేటలో 8,564, యాదాద్రి జిల్లాలో 3,786 దరఖాస్తులు వచ్చాయి. వారంతా మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొన్నేళ్ల కిందట సాదా కాగితంపై భూమి కొనుగోలు చేసి రాయించుకున్న వారిలో అనేక మంది పేర్లు మార్చుకొని పట్టాలు తీసుకోలేదు. ధరణికి ముందున్న ఆర్‌ఓఆర్ చట్టంలో సాదాబైనామాలతో పట్టాలు చేశారు. ధరణి వచ్చిన తర్వాత అవి ఆగిపోయాయి. అయితే వాటిని అమలు చేసేందుకు గత ప్రభుత్వం పూనుకోగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 25,430 దరఖాస్తులు వచ్చాయి. అమలులో జాప్యం చేయడం, ఆ తర్వాత ఎన్నికలు రావడంతో అవి మూలన పడ్డాయి.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ముగిసిన ఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్

నల్లగొండ : క్రీడాపోటీల్లో గెలుపు ఓటములు సహజమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి అన్నారు. నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో 20 రోజులుగా నిర్వహిస్తున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంతి మాట్లాడుతూ ఎన్జీ కళాశాల మైదానాన్ని భవిష్యత్‌లో అందరికీ అనుకూలంగా ఉండేలా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా ఎస్‌ఎల్‌బీసీకి రూ.4 వేల కోట్లు మంజూరు చేయించి, టన్నెల్ తవ్వే మిషన్ బేరింగ్‌ను అమెరికా నుంచి తెప్పిస్తున్నామని చెప్పారు. ఎంజీయూని వర్సిటీలో రెండు కొత్త బ్లాక్‌లు నిర్మిస్తున్నామని, ఐటీ టవర్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. లతీఫ్‌సాబ్ గుట్టను రూ.107 కోట్లతో టూరిజం కేంద్రంగా మార్చేందుకు టెండర్లు పిలిచామని చెప్పారు.

విజేతలకు బహుమతులు

శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మార్నింగ్ లెజెండ్ జట్టు విజేతగా నిలువగా.. రూ.2,00,116, రన్నరప్‌గా నిలిచిన ఆర్వీఎన్ జట్టుకు రూ.1,00,116 నగదు, ట్రోఫీలను మంత్రి కోమటిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూనే శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. ఆరోగ్యంతో పాటు, చదువుపై కూడా దృష్టి పెట్టాలని క్రీడాకారులకు సూచించారు. ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ క్రీడలు మనిషి జీవితంలో ముఖ్యమని, ఓడినవారు.. గెలిచినవారిని స్ఫూర్తిగా తీసుకొని ఆటలాడాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాల్వలను మార్చిలోగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : బ్రాహ్మణవెల్లెంల – ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం కాల్వలను మార్చిలోగా పూర్తిచేసి చెరువులు నింపి మొదటి దశలో 50,000 ఎకరాలకు సాగునీరు అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్‌పై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. కెనాల్ పనుల భూసేకరణకు ప్రభుత్వం రూ.37 కోట్లు మంజూరు చేసిందని.. మరో రూ.35 కోట్లను వారం రోజుల్లో విడుదల చేయనుందని తెలిపారు. సమావేశంలో ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

గుర్రంపోడు : మండలకేంద్రంలోని కస్తూరిబా గురుకుల విద్యాలయాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం నాణ్యతను పరిశీలించారు. బియ్యం పురుగులు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. స్టోర్ రూమ్‌ను, వంట గదిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ మంజుల, సివిల్ సప్లయి ఆర్‌ఐ రావుల సైదులుగౌడ్ ఉన్నారు.

యోగా, చెస్‌తో మానసిక దృఢత్వం



సీఎం కప్ చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు యోగా, చెస్ ద్వారా మానసిక దృఢత్వం కలిగి ఉంటారని జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి అన్నారు. సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో భాగంగా శుక్రవారం నల్లగొండలో యోగా, చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ ఆడడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడాలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, వాడపల్లి రవీందర్, కవిత, కరుణాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నాగరాజు, మాణిక్యం, నుస్రఫ్, అష్రఫ్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో నూతన బ్లాక్ నిర్మించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిర్మాణ పనుల పరిశీలనకు వస్తున్న కలెక్టర్ త్రిపాఠి

నల్లగొండ : నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొత్త బ్లాక్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి నూతన బ్లాక్‌ల నిర్మాణ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. మెడికల్ కళాశాల నిర్వహించిన భవనం, గతంలో నిర్వహించిన ఓపీ బ్లాక్‌ను పూర్తిగా తొలగించి.. ఈ రెండింటి స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.32 కోట్లు విడుదల చేసిందన్నారు. మెడికల్ కళాశాల సామగ్రిని నూతన భవనానికి తరలించాలని, మెడికల్ కళాశాల స్థానంలో నూతన బ్లాక్‌ను నిర్మించేందుకు గోడ నిర్మించి రోగులకు ఇబ్బంది కలగకుండా పనులు ప్రారంభించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ విభాగాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, ఎస్‌ఎంఐడీసీ ఈఈ జైపాల్ రెడ్డి, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలి

ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు సర్వే బృందాలు వచ్చినప్పుడు దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై శుక్రవారం ఆమె కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ వరకు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే ఉంటుందని.. దరఖాస్తుదారులు సర్వే సిబ్బందికి అందుబాటులో ఉండి వారి ఫొటోతో సహా ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఇతర వివరాలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమయంలో దరఖాస్తుదారులు ఇతర ప్రాంతానికి వెళ్తే వాట్సాప్ ద్వారా సమాచారాన్ని తెలపడంతో పాటు దాని ఆధారాలను సర్వే బృందాల దగ్గర ఉంచుకోవాలన్నారు. సర్వే చేసే పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు దరఖాస్తుదారుడిని ఇంటిముందు నిలబెట్టి ఒక ఫొటో, ఇంటి రూఫ్ కనిపించే విధంగా మరో ఫొటో, ఇంటి లోపల భాగం ఒక ఫొటోను తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. అన్నీ నిర్ధారణ చేసుకున్న తర్వాతే అప్లికేషన్లు సమర్పించాలని సూచించారు. సర్వే పూర్తయ్యేవరకు పంచాయతీ కార్యదర్శులకు సెలవులు మంజూరు చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, దేవరకొండ ఆర్డీఓలు రమణారెడ్డి, శ్రీదేవి, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎలాంటి నేర సంఘటనలు జరుగకుండా నిరంతరం నిఘా ఉంచాలని దొంగతనాలు, గంజాయి, రేషన్ బియ్యం, పేకాట లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగకుండా చూడాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించి కోర్టు ద్వారా నేరస్తులకు శిక్ష పడితేనే బాధితులకు పోలీస్ శాఖపై భరోసా కలుగుతుందన్నారు. ప్రతి అధికారికి పూర్తిస్థాయిలో విచారణ, స్టేషన్ నిర్వహణ తెలిసి ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. మహిళా భద్రతకు భరోసా కల్పిస్తు వారి రక్షణే ధ్యేయంగా సేవలు అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయాలని, అతివేగం, త్రిబుల్ రైడింగ్, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటి వాటిపై దృష్టి సారించి ప్రత్యేక తనిఖీ చేయాలన్నారు. గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణ జరగకుండా నిఘా పెట్టాలన్నారు. పదే పదే నేరాలకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, గిరిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

త్రిపురారం : మండలంలోని రాజేంద్రనగర్ మండల పరిషత్ పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకన్నపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా విద్యాధికారి భిక్షపతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం త్రిపురారం ఎంఈఓ రవినాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పాఠశాలలో ఎస్‌జీటీ వెంకన్న కొంతకాలంగా విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడంతో రెండు నెలలు జీతం నిలుపుదల చేశామన్నారు. అయినా సదరు ఉపాధ్యాయుడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో డీఈఓకు నివేదిక పంపామన్నారు. దీంతో వెంకన్నను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ఏడాదిగా ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

దేవరకొండ : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏడాదిగా తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి, తెలంగాణను ప్రపంచ పటంలో పెట్టేందుకు ఫార్ములా-ఈ రేస్ నిర్వహించామన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేటీఆర్‌పై చిల్లర కేసులు పెట్టడం సరికాదన్నారు. సమావేశంలో టీవీఎన్ రెడ్డి, గాజుల ఆంజనేయులు, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, పల్లా లోహిత్‌రెడ్డి, ఉపేందర్, తులసీరాం, ఖాదర్‌బాబా, అఫ్రోజ్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి



అజయ్‌కుమార్

నల్లగొండ : సాగర్ ఎడమకాలువ చివరి భూములకు నీరందేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని చీఫ్ ఇంజినీర్ (సీఈ) వి.అజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎడమ కాలువ కింద మొత్తం 6.30 లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారని తెలిపారు. ఎగువ రైతులు క్యాలకు గండ్లు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. యాసంగి పంటకు ఈ నెల 15 నుంచి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో అందిస్తున్నట్లు తెలిపారు. మొదటి దఫాలో యాసంగి నాట్లు పడేంత వరకు 27 రోజులు నిరంతరాయంగా నీరు అందిస్తామన్నారు. మిగిలిన ఆరు దఫాల్లో 9 రోజులు చొప్పున నీరు ఇస్తామని.. ఆరు రోజులు బంద్ చేస్తామని తెలిపారు. ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ కింద 1.97 లక్షల ఎకరాల ఆయకట్టుకు, లో లెవల్ కెనాల్ కింద 42,950 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

పోతురాజులు, బోనాలతో ర్యాలీ





సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం నల్లగొండలో బోనాలు, పోతురాజుల విన్యాసాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, బోనంతో సమగ్రశిక్షా ఉద్యోగి

క్లుప్తంగా

స్వర్ణగిరిలో త్రిపుర హైకోర్టు జడ్జి



స్వర్ణగిరి క్షేత్రాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి అమర్‌నాథ్‌గౌడ్

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శుక్రవారం త్రిపుర హైకోర్టు జడ్జి అమర్‌నాథ్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి స్వామి వారి ప్రసాదం అందజేసి శాలువాతో సన్మానించారు.

ఎన్జీవోస్ కాలనీలో చోరీ

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో గురువారం రాత్రి పట్టిపాటి శిరీష నివాసంలో గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేశారు. సమీపంలోనే ఉన్న తన తల్లి ఇంటికి శిరీష గురువారం వెళ్లింది. శుక్రవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగులకొట్టి ఉంది. బీరువా, కబోర్డుల్లోని బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు శిరీష టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

నరేందర్ ఆమరణ నిరాహార దీక్ష భగ్నం



దీక్ష చేస్తున్న నల్ల నరేందర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

భువనగిరిటౌన్: పేదలకు ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్‌ని గురువారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీక్షను భగ్నం చేసిన పోలీసుల వైఖరిని నిరసిస్తూ ధర్మసమాజ్ పార్టీ కార్యకర్తలు భువనగిరిలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ యాదవ్ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, నరేందర్ దీక్షను పోలీసులు భగ్నం చేసినా.. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అందించే వరకు ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సామాజికవేత్త బట్టు రాంచంద్రయ్య, బర్రె సుదర్శన్, బీసీ సంఘం నాయకులు సాయిని నర్సింహ, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు లింగస్వామి, శాంతికుమార్, శివ, శ్రీకాంత్, మహేష్, కిరణ్, సాయి, గోవర్ధన్, నవీన్, సాయికిరణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అయిటిపాములలో స్వబాగ్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోలార్ రీనవబుల్ ఎనర్జీ ఉత్పత్తి చేసే ప్రక్రియను ఇటీవల కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. మహిళలు బ్యాటరీల రీచార్జ్ యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఎనర్జీ ఉత్పత్తి చేస్తే సోలార్ ల్యాబ్ కంపెనీ కొనుగోలు చేస్తుందని, దీంతో మహిళలకు ఆర్థికంగా ఆసరా అవుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన.. పైలెట్ ప్రాజెక్టు కింద అయిటిపాములకు చెందిన 50 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అయిటిపాములకు చెందిన మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడితే మరింత మంది దాతల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. తాను చేసిన ఆర్థిక సాయం వృథా కావొద్దని మరింత మందికి ఉపయోగపడేలా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటిసారిగా మహిళా సంఘాలకు సోలార్ ఎనర్జీ బ్యాటరీల ఏర్పాటుకు రూ. 50 లక్షలు ఆర్థికసాయం ఇవ్వడం జరిగిందన్నారు. బ్యాటరీల పరిశీలనకు జిల్లా యంత్రాంగం తరపున పరిశ్రమల శాఖ జీఎం, వ్యవసాయ శాఖ జేడీఎంను నోడల్ అధికారులుగా నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వబాగ్స్ ల్యాబ్స్ సీఈఓ సుధాకర్, మేనేజింగ్ డైరెక్టర్ సత్యసోలార్, ఎస్పీ శరత్ చంద్రపవార్, జీఎం కోటేశ్వర్‌రావు, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఆధారాలతోనే కేటీఆర్‌పై కేసు నమోదు

- ఎమ్మెల్సీ కోదండరాం



మాట్లాడుతున్న తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం

చౌటుప్పల్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిబంధనలు ఉల్లంఘించి నిధుల కేటాయింపులు చేశారని, పక్కాగా ఆధారాలు ఉన్నందునే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదైందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. శుక్రవారం చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి అనుమతులు సైతం తీసుకోకుండానే తమ ఇష్టానుసారంగా కేటాయింపులు చేశారని ఆరోపించారు. వాస్తవాలు బయటకు వచ్చేంత వరకు కూడా బీఆర్ఎస్ పార్టీ సభ్యులకు ఓపిక లేకుండానే ఉభయ సభల్లో నానా యాగి చేస్తున్నారని ధ్వజమెత్తారు. సభల్లో రైతుభరోసా, ఆర్‌వోఆర్ వంటి కీలమైన బిల్లులను ప్రవేశపెట్టాల్సి ఉన్నప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు అడ్డుపడుతున్నారని విమర్శించారు. తప్పు చేసిన వ్యక్తులే అసెంబ్లీని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు. చిన్నచిన్న గ్రామ పంచాయతీల్లోనే నిధులను కేటాయించే క్రమంలో నిబంధనలు పాటిస్తారని, అలాంటి కోట్లాది రూపాయలను కేటాయించే క్రమంలో నిబంధనలను పాటించకుంటే ఎలా అని ప్రశ్నించారు.

అభివృద్ధిలో వెనుకబడిన యాదాద్రి జిల్లా..

హైదరాబాద్‌కు కూతవేటు దూరంలోనే ఉన్నప్పటికీ యాదాద్రిభువనగిరి జిల్లా అభివృద్ధిలో మాత్రం వెనుకబడిందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. జిల్లాలోని సమస్యల పరిష్కారానికి జనసమితి శ్రేణులు కృషి చేయాలన్నారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, నాయకులు లక్ష్మారెడ్డి, పన్నాల గోపాల్‌రెడ్డి, గంగసాని శ్రీనివాస్‌రెడ్డి, నకిరేకంటి అశోక్, అంజనేయచారి, మందాల బాలకృష్ణారెడ్డి, మల్ల యాదయ్య, బలిక నర్సింహ, జమ్మి గిరిబాబు, కొత్తపెల్లి గోవర్ధన్, గడ్డం యాదగిరి, అశోక్‌చారి, దయానందం, కూన యాదయ్య పాల్గొన్నారు.

బ్యాంకు లోన్ ఇప్పించి డబ్బులతో పరారు

- జెర్రిపోతులగూడెంలో ఆలస్యంగా వెలుగులోకి

చిలుకూరు: కాలనీవాసులకు బ్యాంక్ లోన్ ఇప్పించిన ఓ వ్యక్తి ఆ డబ్బులతో పరారయ్యాడు. ఈ ఘటన శుక్రవారం చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామంలో వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఇల్లు ఉంటే చాలు కోదాడకు చెందిన ప్రైవేట్ బ్యాంక్‌లో స్వల్పకాలిక రుణాలు ఇస్తున్నారని జెర్రిపోతులగూడెం ఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి కాలనీ వాసులకు నమ్మబలికాడు. దీంతో కాలనీకి చెందిన 20 మందికి పైగా ధ్రువపత్రాలు సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో బ్యాంక్ వారు కాలనీకి వచ్చి వారి చేత సంతకాలు చేయించుకుని ఒక్కొక్కరికి రూ. 40 వేలు లోన్ మంజూరు చేశారు. వారి అ కౌంట్‌లో డబ్బులు పడగానే ఆ వ్యక్తి తిరిగి కొంత మందితో డ్రా చేయించి వారి నుంచి తీసుకున్నాడు. మరికొంత మందితో బ్యాంక్ విత్‌డ్రా ఓచర్స్‌పై సంతకాలు చేయించుకున్నట్లు తెలిసింది. మొత్తంగా వా రి నుంచి సుమారుగా రూ.9 లక్షల వరకు తీసుకున్నాడు. ఈ వ్యవహారం జరిగి రెండు నెలలు అవుతుంది.

సర్వే కోసం అధికారులు కాలనీకి వెళ్లడంతో విషయం వెలుగులోకి..

లోన్ తీసుకున్న వారు డబ్బులను బ్యాంక్‌లో ఒకటి, రెండు వారాలు చెల్లించి, తరువాత చెల్లించకపోవడంతో బ్యాంక్ సిబ్బంది బాధితుల వద్దకు వచ్చారు. లోన్ డబ్బులు తీసుకున్న వ్యక్తి మాకు ఇంతవరకు ఇవ్వలేదని, వారం రోజులుగా అతను కాలనీలో కనిపించడం లేదని, ఆ డబ్బులను మేము ఎలా చెల్లించాలని తెలిపారు. దీంతో అవన్నీ మాకు సంబంధం లేదనీ.. మీ అకౌంట్‌లో డబ్బులు వేశాం .. మీరు చెల్లించాల్సిందే అని బ్యాంక్ సిబ్బంది తేల్చిచెప్పారు. డబ్బులు తీసుకున్న వ్యక్తి పరారు కావడంతో బాధితులు తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం అధికారులు కాలనీకి వెళ్లారు. వారిని ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ఇవ్వమని అడిగితే రెండు నెలల క్రితం ఇలాగే ఒకరిని నమ్మి కాగితాలు ఇస్తే తమ పేరుతో లోన్లు తీసుకుని పరారయ్యాడని, ఇప్పుడు ఎలాంటి కాగితాలు ఇవ్వబోమని చెప్పడంతో ఈ విషయం బయటపడింది.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

నడిగూడెం : రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నడిగూడెం మండల పరిధిలోని రత్నవరం గ్రామానికి చెందిన రామిని వెంకటరెడ్డి (60) గత కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 18న హైదరాబాద్‌లో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన వెంకటరెడ్డిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి

చివ్వెంల(సూర్యాపేట): గుర్తు తెలియని వాహనం ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం ఎరసానిగూడెం గ్రామానికి చెందిన రేపాక సురేందర్‌రెడ్డి (49) వృత్తి రీత్యా డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్‌లోని మేడ్చల్ నుంచి జార్ఖండ్ రాష్ట్రానికి తన డీసీఎంలో టెలిఫోన్ టవర్స్ ఫ్యాన్స్ లోడ్‌తో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఐలాపురం గ్రామ శివారులో ఎదురుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఇతడి డీసీఎంను ఢీకొట్టింది. దీంతో సురేందర్‌రెడ్డికి తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావమరిది వెంకట్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కనక రత్నం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మందులు పంపిణీ చేస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజశేఖర్

భూదాన్‌పోచంపల్లి: పాల ఉత్పత్తులను పెంచుకుని రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముకుల, దంతూర్, వంకమామిడి గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 303 పశువులకు గర్భకోశ చికిత్స చేసి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం దూడల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాడి రైతులకు మందులు, పాల క్యాన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో సబ్సిడీ కింద నూతన సాంకేతిక విధానంలో కృత్రిమ గర్భధారణ చేయించడం వల్ల అధిక పాల దిగుబడి ఇచ్చే మేలుజాతి ఆడదూడలు పుట్టించే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ సమయంలో మేలుజాతి పశుసంపదను అభివృద్ధి చేయడమే ఈ పథకం లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అశోక్, శ్రీనివాస్, రఘు, వెంకటేశ్, రాంచంద్రారెడ్డి, పృథ్వీ, వెటర్నరీ అసిస్టెంట్లు రమేశ్, జమీల్, మహేశ్, లింగస్వామి, రాజు, బాల నర్సింహ, వేణుగోపాల్, శేఖర్ పాల్గొన్నారు.

ధాన్యం బోనస్‌కు కక్కుర్తి పడి..

- ఆంధ్రా నుంచి తక్కువ ధరకు ధాన్యం కొని చిలుకూరు మండలం కొండాపురం కేంద్రానికి తరలింపు
- నిబంధనలను బేఖాతర్ చేస్తూ కొనుగోలు చేసిన నిర్వాహకులు



ధాన్యాన్ని కాంటా వేస్తున్న కూలీలు

చిలుకూరు: ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు కక్కుర్తి పడిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై అక్రమాలకు తెర తీశారు. నేరేడుచర్లకు చెందిన మిల్లరు ఆంధ్రప్రదేశ్ నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి చిలుకూరు మండలం కొండాపురంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం అమ్మిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున కర్ణాటక రిజిస్ట్రేషన్ ఉన్న లారీలో 400 బస్తాల వరి ధాన్యాన్ని చిలుకూరు మండలం కొండాపురంలోని కొనుగోలు కేంద్రానికి వచ్చింది. ధాన్యంతోపాటు నేరేడుచర్లకు చెందిన ఒక మిల్లుకు చెందిన కూలీలు కూడా వచ్చారు. బస్తాల్లో ఉన్న ధాన్యాన్ని గ్రామంలోని ఒక ప్రదేశంలో రాశులుగా పోశారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు నిబంధనలు బేఖాతర్ చేస్తూ ఈ ధాన్యాన్ని సాయంత్రం 4 గంటలకు కాంటా వేయించారు. ఈ ధాన్యం మొత్తం నేరేడుచర్లకు చెందిన రైస్ మిల్లు వ్యాపారి ఆంధ్రా నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి కొండాపురం గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినట్లు తెలిసింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, సంఘం బంధం అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. కానీ కొండాపురం గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో నిబంధనలు బేఖాతరు చేస్తూ బయటి ధాన్యం కొనుగోలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కొనుగోలు చేసిన కేంద్రంపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి

- బైక్‌ను ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- తాళ్లగూడెం సమీపంలో ఘటన





సంధ్య, క్రాంతి మృతదేహాలు

యాదగిరిగుట్ట రూరల్: కారు ఢీ కొట్టడంతో తల్లీకుమారుడు మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్టలోని హైదరాబాద్– వరంగల్ ప్రధాన జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాదిరెడ్డి సంధ్య అలియాస్ శాంతి(35) ఆమె కుమారుడు మాదిరెడ్డి క్రాంతి (15), హైదరాబాద్‌లోని ఈసీఎల్ దమ్మాయిగూడలో నివాసం ఉంటున్నారు. శాంతి భర్త ప్రతాప్‌రెడ్డి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. సంధ్య తన కుమారుడు, అదే ప్రాంతానికి చెందిన మరొక వ్యక్తి రాజుతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి స్కూటీపై వ్యక్తిగత పని నిమిత్తం వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం సమయంలో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈక్రమంలో యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం స్టేజీ సమీపానికి రాగానే, అదే రూట్లో వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి స్కూటీని ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఎగిరి కింద పడిపోయారు. దీంతో సంధ్య, ఆమె కుమారుడు క్రాంతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న రాజుకు తీవ్ర గాయాలు కాగా, ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కొమరబండ శివారు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కారు పల్టీ కొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన ఎస్.వీరేష్, రాజేశ్వరీ, ఎస్.మురళీకృష్ణా, పద్మావతిలతో పాటు ఓ చిన్నారి విజయవాడ నుంచి హైదరాబాద్‌కు కారులో బయలు దేరారు. మార్గమధ్యంలోని న్యూవిజన్ స్కూల్ సమీపంలో కారు అదుపుతప్పి పల్టీ కొట్టి రోడ్డు కింద పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో పద్మావతి, రాజేశ్వరీకి తీవ్ర గాయలు కాగా వీరేష్, మురళీకృష్ణాలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పద్మావతి, రాజేశ్వరిల పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. కాగా.. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ అనంతలోకాలకు

- లారీ ఢీకొని మహిళ మృతి



విజయలక్ష్మి (ఫైల్)

కోదాడరూరల్: బంధువుల అంత్యక్రియ లకు హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని తొగర్రాయి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మోతె మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన పోగూరి రమేష్, విజయలక్ష్మి (38) దంపతులు. విజయలక్ష్మి తన తల్లిగారి గ్రామమైన తొగర్రాయిలో బాబాయి కుమారుడు మృతిచెందడంతో అంత్యక్రియలకు బైక్‌పై వెళ్లారు. గ్రామశివారుకు వెళ్లిన తర్వాత మేళ్లచెర్వు నుంచి కోదాడ వైపు వస్తున్న లారీ ట్యాంకర్ వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన విజయలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా భర్తకు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త రమేష్ యాదగిరిగుట్ట బస్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.


గుర్తుతెలియని వాహనం ఢీకొని..

త్రిపురారం: నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన మర్రి దుర్గయ్య (55) త్రిపురారం మండలంలోని నీలాయి గూడెంలో తన దగ్గరి బంధువుల్లోని వ్యక్తి చనిపోవడంతో అంత్యక్రియలకు వచ్చాడు. కార్యక్రమం పూర్తయిన అనంతరం బైక్‌పై నీలాయిగూడెం గ్రామం నుంచి ముప్పారం గ్రామానికి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో దుర్గయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం నల్లగొండ పట్టణంలోని రామగిరిలో శుక్రవారం చోటుచేసుకుంది. బొట్టుగూడకు చెందిన గంగిశెట్టి వెంకటేశం(50) రామగిరిలో ఆయుర్వేద మందుల దుకాణం నడుపుతున్నాడు. షాప్‌కు వస్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత ఇంటికి వెళ్లి కళ్లు తిరుగుతున్నట్లు కుటుంబసభ్యులకు చెప్పాడు. దీంతో వారు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై నాగరాజు తెలిపారు.

రాజాపేట నుంచి బంటుగూడెం వెళ్తుండగా..



భిక్షపతి (ఫైల్)

రాజాపేట: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి పడి తీవ్రగాయాలు కావడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన రాజాపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. రాజాపేట మదిర గ్రామం బంటుగూడెం గ్రామానికి చెందిన గొల్లెన భిక్షపతి (55) రాజాపేట నుంచి బంటుగూడెం గ్రామానికి సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో గ్రామస్తులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడడంతో..

కొడకండ్ల: బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని హక్యాతండా గ్రామ పంచాయతీ పరిధి వెలిశాల శివారులో శుక్రవారం చోటు చేసుకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు గాంధీనగర్‌కు చెందిన పందుల నగేశ్(40) బైక్‌పై కొడకండ్ల వైపు వస్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై చింత రాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వానరాల బెడద.. ఉండదు ఇక



మునగాలలో వానరాలను తరిమికొట్టే గొట్టాలను విక్రయిస్తున్న మహిళ



పరికరం పనితీరును వివరిస్తున్న మహారాష్ట్ర వాసి

మునగాల: ఇటీవల గ్రామాల్లో వానరాలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో మహారాష్ట్రలోని అకోలాకు చెందిన ఓ కుటుంబం వానరాలను తరిమేందుకు పెద్ద శబ్దం వచ్చే పరికరాలను తయారు చేశారు. వీటిని శుక్రవారం మునగాలకు తీసుకువచ్చారు. ఈ పరికరాల ధర రూ.150 ఉండడంతో జనాలు అధికంగా కొనుగోలు చేశారు.

లారీ ఢీకొనడంతో విద్యార్థి దుర్మరణం



గణేష్ (ఫైల్)

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ వద్ద శుక్రవారం ఆగి ఉన్న టీవీఎస్‌ను లారీ ఢీకొనడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల ప్రకారం.. స్వెటర్లు కొనేందుకు శ్రీనగర్‌కాలనీకి చెందిన డిగ్రీ విద్యార్థి చిట్లపల్లి గణేష్ (18) తన అమ్మమ్మ సిలువేరు పద్మతో కలిసి టీవీఎస్‌పై వచ్చి క్లాక్‌టవర్ వద్ద ఉన్న దుకాణం ఎదుట ఆగాడు. మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్ మిర్యాలగూడ వైపు వెళ్తూ.. ఆగి ఉన్న టీవీఎస్‌ను ఢీకొనడంతో పద్మ కొద్ది దూరంలో ఎగిరి పడగా, గణేష్ లారీ టైరు కింద పడ్డాడు. దీంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప ప్రజలు గట్టిగా కేకలు వేయడంతో లారీని డ్రైవర్ నిలిపాడు. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు లారీ డ్రైవర్‌ను టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నకిరేకల్ మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన గణేష్ నల్లగొండలోని తన అమ్మమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. తండ్రి రామలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బైక్‌ల చోరీ ముఠా అరెస్టు

- రూ.10లక్షల విలువైన 17 మోటారు సైకిళ్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు,

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి, చింతపల్లి, దేవరకొండ, డిండి ప్రాంతాల్లో బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10లక్షల విలువైన 17 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం దేవరకొండ డీఎస్పీ గిరిబాబు వెల్లడించారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన భక్తోజు శివ అలియాస్ లడ్డూ, గౌతమ్ అలియాస్ చింటు, వరికుప్పల అశోక్, సురకారపు శివ అలియాస్ కరీం ఒక ముఠాగా ఏర్పడి బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఆయా పోలీస్ స్టేషన్‌లలో బైకుల చోరీకి సంబంధించి బాధితుల నుంచి ఫిర్యాదులు రావడంతో స్పందించిన పోలీసు శాఖ ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి సీఐ, ఎస్ఐ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద శుక్రవారం పట్టుబడిన ముఠాసభ్యులను విచారించగా జల్సాలు, చెడు అలవాట్లకు బానిసై రాత్రి సమయాల్లో ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలించినట్లు వారు అంగీకరించారు. చింతపల్లి, మాడ్గుల, యాచారం మండలాల పరిధిలో 17 బైకులను దొంగలించినట్లు నిర్ధారించారు. ఈ మేరకు రూ.10లక్షల విలువైన 17 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చేధించడంలో కీలక పాత్ర పోషించిన కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, ఎస్ఐలు రామ్మూర్తి, నర్సింహులు, క్రైమ్ సిబ్బంది హేమునాయక్, భాస్కర్, వెంకటేష్, శేఖర్‌రెడ్డి,, హోం గార్డు లక్ష్మయ్య, రమేష్‌లను ఎస్పీ అభినందించి రివార్డు అందజేసినట్లు డీఎస్పీ తెలిపారు.